ట్రాఫిక్ ఐలాండ్‌లు ఖాళీ

- తుప్పు పట్టడంతో వినియోగించని సిబ్బంది
- ఎండావానల్లో రోడ్డుపైనే విధులు
- బిచ్చగాళ్లు, ఆకతాయిలకు నిలయంగా మారిన ఐలాండ్‌లు



తాటిచెట్లపాలెం జాతీయ రహదారికి వెళ్లే మార్గంలో శిథిలావస్థలో అవుట్ పోస్టు



కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ కూడలిలోని ట్రాఫిక్ ఐలాండ్‌లో బిచ్చగాళ్లు

కంచరపాలెం : ట్రాఫిక్ నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ, నిఘా నిమిత్తం ఏర్పాటు చేసిన ట్రాఫిక్ ఐలాండ్‌లు, అవుట్ పోస్టులు నిరుపయోగంగా మారాయి. తుప్పు పట్టి శిథిలావస్థకు చేరడంతో సిబ్బంది వాటిని వినియోగించడం లేదు. ప్రస్తుతం అవన్నీ బిచ్చగాళ్లు, ఆకతాయిలకు నిలయంగా మారినా ఉన్నతాధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. కంచరపాలెం కూడలి, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, మర్రిపాలెంలోని అవుట్ పోస్టులు మూతపడినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కంచరపాలెం కూడలి ముత్యమాంబ ఆలయం వద్ద అవుట్ పోస్టు కోసం వేల రూపాయలు ఖర్చు చేశారు. అటు తాటిచెట్లపాలెం, ఇటు జ్ఞానాపురం, సింహాచలం వెళ్లే వాహనాల నియంత్రణకు సిబ్బంది విధులు నిర్వహించేవారు. అదే విధంగా మురికివాడలు, కొండవాలు ప్రాంతాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా కంచరపాలెం, ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలో ఊర్వశి కూడలి, కంచరపాలెం ఫ్లైఓవర్ కూడలిలో ఏళ్ల క్రితం ఈ అవుట్‌పోస్టు ఏర్పాటు చేశారు. కంచరపాలెం, తాటిచెట్లపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా తదితర ప్రాంతాల్లో మందుబాబులు, అసాంఘిక శక్తులు, నేరస్తులను అదుపు చేయడంలో ఇక్కడి అవుట్ పోస్టులు కీలక పాత్ర పోషించేవి. నిత్యం వేలాది వాహనాలు, పాదచారులు సంచరించే ఈ కూడళ్లో అవుట్‌పోస్టుల వల్ల ఆకతాయిలు, మందుబాబులు భయపడేవారు. ప్రస్తుతం వీటిలో ట్రాఫిక్ పోలీసులు సేదతీరుతున్నారని... లా అండ్ అర్డర్ సిబ్బంది కానరావడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

ట్రాఫిక్ నియంత్రణలో సమస్యలు

కూడలిలో ట్రాఫిక్ ఐలాండ్ తుప్పుపట్టి నిరుపయోగంగా ఉండడంతో బిచ్చగాళ్లు, మతిస్థిమితం లేని వాళ్లు నివసిస్తున్నారు. కాన్వెంట్ కూడలి జ్ఞానాపురం నుంచి కంచరపాలెం కూడలి మీదుగా తాటిచెట్లపాలెం వద్ద జాతీయ రహదారిపైకి భారీ వాహనాలు నిషిద్ధ సమయంలో వెళ్లకుండా ఇక్కడ ట్రాఫిక్ పోలీసులు గతంలో నియంత్రించేవారు. ప్రస్తుతం పర్యవేక్షించే వారు లేకపోవడంతో భారీ వాహనాలు ఇష్టమొచ్చినట్లు రాకపోకలు సాగించడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. పండగ సమయంలో కనిపించే ట్రాఫిక్ కానిస్టేబుళ్లు మిగతా రోజుల్లో ఎక్కువగా ఉండడం లేదని వాహనదారులు చెబుతున్నారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులను మరింత మందిని కూడళ్లలో విధులు నిర్వహించేలా చూడాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి ట్రాఫిక్ ఐలాండ్‌లను వినియోగంలోకి తీసుకురావాలని, సిబ్బందిని నియమించి నిఘాను కొనసాగించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.



ఊర్వశి కూడలిలో నిరుపయోగంగా ట్రాఫిక్ ఐలాండ్

ఉన్నతాధికారులు స్పందించాలి

అల్లరి మూకలు, ముందుబాబుల ఆగడాలు పెరిగిపోవడంతో స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఏదైనా జరిగితే ఫిర్యాదు చేయడానికి పోలీస్ స్టేషన్ చుట్టూ తిరగాల్సి వస్తోంది. గతంలో ఇక్కడ అవుట్ పోస్టులు ఉండడంతో ఫిర్యాదు చేసుకునేందుకు ఎంతగానో ఉపయోగపడేవి. పోలీసు సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అన్నీ మూతపడుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించాలి.

– జి.శేఖర్, వాహనదారుడు, జ్ఞానాపురం

ట్రాఫిక్ నియంత్రణలో ఇబ్బందులు

బీఆర్‌టీఎస్ రహదారులు, జాతీయ రహదారి కూడళ్లో ట్రాఫిక్ ఐలాండ్‌లు నిరుపయోగంగా మారాయి. శిథిలావస్థకు చేరుకోవడంతో ట్రాఫిక్ పోలీసులు వినియోగించడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో ఎండ, వానకు ఇబ్బంది పడుతూ రోడ్డుపైనే విధులు నిర్వర్తిస్తున్నారు. ఫలితంగా ట్రాఫిక్ నియంత్రణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి ఐలాండ్‌లను వినియోగంలోకి తీసుకురావాలి.

– ఎన్.పవన్‌కుమార్, వాహనదారుడు, కంచరపాలెం

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపు

సీతమ్మధార : నియోజకవర్గ పరిధిలో ఎట్టకేలకు టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆక్రమణలు తొలగించారు. పలు ప్రాంతాల్లోని ఫుట్‌పాత్‌లు నడకదారులకన్నా ఆక్రమణదారులు అన్న చందంగా మారిపోతున్నా ఎవరూ పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో 'యథేచ్ఛగా ఆక్రమణ' శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. జోనల్ కమిషనర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ సిబ్బంది బుధవారం బాలయ్యశాస్త్రి లే అవుట్ తదితర ప్రాంతాల్లోని ఫుట్‌పాత్‌ల మీద గల ఆక్రమణలు తొలగించారు. టీపీవో ప్రసన్న, సచివాలయం ప్లానింగ్ సెక్రటరీ హరీష్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆక్రమణలు తొలగించారు. సీతమ్మధార, బాలయ్య శాస్త్రి లే అవుట్, టీపీటీ కాలనీ, పీ అండ్ టీ కాలనీ, నక్కవానిపాలెం, సత్యం జంక్షన్, తదితర ప్రాంతాల్లోని ఫుట్‌పాత్‌ల మీద గల ఆక్రమణలు తొలగించారు. 'సాక్షి' కథనంతో ఆక్రమణలు తొలగించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



బాలయ్య శాస్త్రి లే అవుట్‌లో ఫుట్‌పాత్ మీద ఉన్న తోపుడుబండి తొలగిస్తున్న సిబ్బంది

భవన నిర్మాణ సామగ్రి తొలగింపు

టీపీటీ కాలనీలో రోడ్డు మీద గల భవన నిర్మాణ సామగ్రిని టౌన్‌ప్లానింగ్ సిబ్బంది బుధవారం తొలగించారు. రోడ్డు మీద ఇష్టారాజ్యంగా భవన నిర్మాణ సామగ్రి వేసేయడంతో 'ఎలా వెళ్లేది' శీర్షితో 'సాక్షి'లో ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించారు. టౌన్ ప్లానింగ్ సిబ్బంది బుధవారం సామగ్రి తరలించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెం వద్ద గల శ్రీ శాంతిస్వరూపిణి దుర్గా అమ్మవారి ఆలయం ఆవరణలో కేఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. రాష్ట్ర మారిటైం బోర్డు మాజీ చైర్మన్ కాయల వెంకటరెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి అన్నదానం ప్రారంభించారు. అంతకుముందు ఆయన శాంతిస్వరూపిణి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరి మీదా వుండాలని ఆకాంక్షించారు. అలాగే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ట్రస్టు సభ్యులను అభినందించారు. ట్రస్టు అధ్యక్షుడు కర్రి మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి మాలధారులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో కాయల సూరారెడ్డి, బోసు, ట్రస్టు సభ్యులు కె.సత్యనారాయణరెడ్డి, కె.సీతయ్యమ్మ, కె.సుబ్బలక్ష్మి, ఆలయ కమిటీ ప్రెసిడెంట్ గురునాథ్‌రెడ్డి, సెక్రటరీ బాచీ, తదితరులు పాల్గొన్నారు.



అన్నప్రసాదం వడ్డిస్తున్న కర్రి మురళీకృష్ణా రెడ్డి

బుల్లయ్య కళాశాల విద్యార్థుల ప్రతిభ

సీతంపేట: ఆంధ్రా యూనివర్సిటీ అంతర కళాశాలల వెయిట్‌లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, బెస్ట్ ఫిజిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో బుల్లయ్య కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ నెల 2 నుంచి 4 వరకు జరిగిన పోటీల్లో బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పురుషులు, మహిళల వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, బెస్ట్ ఫిజిక్‌లో ఓవరాల్ టీం చాంపియన్‌షిప్ గెలుపొందారు. బెస్ట్ ఫిజిక్‌లో మిస్టర్ ఆంధ్రా యూనివర్సిటీ టైటిల్‌ను ఎంసీఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థి గోపీచంద్ సొంతం చేసుకున్నాడు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ విజేతలను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్స్ జి.ఎస్.కె.చక్రవర్తి, సురేఖ, డి.దీపక్ చౌదరి, వ్యాయామ విభాగాధిపతి వై.శ్రీనివాసరావు, మేజర్ టి.బ్రహ్మానందరెడ్డి, ఫిజికల్ ఎడ్యుకేషన్ లెక్చరర్ యు.గంగాభవానీ పాల్గొన్నారు.



మిస్టర్ ఆంధ్రా యూనివర్సిటీ టైటిల్ విజేత గోపీచంద్‌తో కళాశాల సిబ్బంది

డ్రెయినేజ్‌లో వ్యర్థాల తొలగింపు

సీతంపేట : జీవీఎంసీ 25వ వార్డులోని డ్రెయిన్‌లో అడ్డుపడిన వ్యర్థాలను పారిశుధ్య సిబ్బంది ఎట్టకేలకు తొలగించారు. దుర్గా గణపతి ఆలయం నుంచి రాధాకృష్ణ ఆలయానికి వెళ్లే మార్గంలో బైక్ రెంటల్స్ ఆఫీస్ వద్ద డ్రెయిన్ నుంచి మురుగు నీరు రోడ్డెక్కి ప్రవహిస్తుండడంతో స్థానికుల ఇబ్బందులను 'రోడ్డెక్కిన మురుగుతో అవస్థలు' శీర్షికతో బుధవారం సాక్షిలో ప్రచురించిన వార్తకు జీవీఎంసీ జోన్ – 3 ఉన్నతాధికారులు స్పందించారు. వారి ఆదేశాలతో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సన్యాసినాయుడు పారిశుధ్య సిబ్బందితో వ్యర్థాలు తొలగించారు. మురుగు నీరు సాఫీగా ప్రవహించేలా చెత్త తొలగించారు.



సీతంపేటలో డ్రెయిన్ నుంచి వ్యర్థాలు తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

'గిడుగు దర్శనం' పుస్తకావిష్కరణ

సీతంపేట : డాక్టర్ అల్లంశెట్టి చంద్రశేఖరరావు రచించిన ×గిడుగు దర్శనం€ పుస్తకావిష్కరణ సభ బుధవారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో నిర్వహించారు. నాగార్జున యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్ ముఖ్య అతిథిగా విచ్చేసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిడుగు వ్యవహారిక భాష కోసం, గిరిజనులైన సవరల వికాసం కోసం కృషి చేస్తే, డాక్టర్ అల్లంశెట్టి చంద్రశేఖరరావు గిడుగు భాషోద్యమం, సవర భాషా వికాసం తదితర విషయాలను గిడుగు దర్శనం పుస్తకంలో పొందుపరిచారన్నారు. పుస్తక సమీక్ష చేసిన డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ గిడుగు రామమూర్తిపై మౌళిక పరిశోధనతో వెలువడిన గ్రంథం గిడుగు దర్శనం, భాషా బోధన, వ్యవహార భాష, శాసనాలు, సవర భాష అనే అంశాల్లో గిడుగు వారి ఆలోచనలు, ఆచరణను వివిధ అధ్యాయాల్లో రచయిత చక్కగా వివరించారన్నారు. సహృదయ సాహితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శేఖరమంత్రి ప్రభాకర్, వి.వి.రమణమూర్తి, సీహెచ్.చిన సూర్యనారాయణ, పలువురు సాహితీవేత్తలు, రచయితలు పాల్గొన్నారు.



పుస్తకం ఆవిష్కరిస్తున్న ఆచార్య బాలమోహన్ దాస్, తదితరులు

యువతలో మార్పు తీసుకురావాలి

విశాఖ సిటీ: యువతలో మంచి మార్పును తీసుకొచ్చేలా జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారులు పనిచేయాలని ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు సూచించారు. ఏయూ ఎన్ఎస్ఎస్ సమావేశ మందిరంలో హెరిటేజ్ ఫౌండేషన్‌తో సంయుక్తంగా ప్రోగ్రాం అధికారులకు బుధవారం శిక్షణ నిర్వహించారు. వీటిని ప్రారంభించిన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విభిన్న తరాల మనుషుల్లో వస్తున్న మార్పులను సునిశితంగా పరిశీలించాలన్నారు. వృద్ధులను సమాజానికి ఉపయుక్తంగా చేసుకుంటూ, వారి నుంచి విలువలు, క్రమశిక్షణ నేటి తరానికి అందించడం అవసరమన్నారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్ మాట్లాడుతూ నేడు వృద్ధులు ఒంటరిగా మారిపోతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. హెరిటేజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఎన్.ఆర్.గంగాధరన్ మాట్లాడుతూ ఒకరిని మరొకరు అర్థం చేసుకుంటే సమస్యను పరిష్కరించడం సాధ్యపడుతుందన్నారు. ఎన్ఎస్ఎస్ జిల్లా సమన్వయకర్తలు, ఆచార్య ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎరుకుమాంబకు జలాభిషేకం



ఎరుకుమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ఆలయ ఈవో రమాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల గోత్రనామాలతో విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి జలాభిషేకం చేశారు. అలాగే సాయంత్రం కూడా భక్తులు అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పలు రకాల పూలు, నూతన చీరతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

9న లేడీస్ పిక్నిక్

సీతంపేట : వుడా పార్కు సమీపంలోని ఎంజీఎం మైదానంలో ఈ నెల 9న లేడీస్ పిక్నిక్ అత్యంత వినోదాత్మకంగా నిర్వహించనున్నట్లు వీరూమామ తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను బుధవారం పౌరగ్రంథాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళకు ఒక రోజు పేరిట నిర్వహిస్తున్న లేడీస్ పిక్నిక్‌లో విందు, వినోదం, 20కి పైగా ఫన్ గేమ్స్, 500లకు పైగా బహుమతులతో ప్రతి ఒక్కరికీ బహుమతి లభించేలా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మిస్సెస్ ఇండియా హేమలతారెడ్డి మహిళలతో ముచ్చటిస్తారని, పిక్నిక్‌లో పాల్గొనదలచిన మహిళలు 9912999949లో సంప్రదించవచ్చని తెలిపారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

మర్రిపాలెం : జోన్ – 2 ఎన్ఎస్‌టీఎల్ సెక్షన్ 11 కేవీ మాధవధార ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, నిర్వహణలో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కనకమహాలక్ష్మి టెంపుల్ రోడ్డు, శ్రీ శాంతి ల్యాండ్ మార్క్ ఏరియా, విజేత మార్ట్ ఏరియా, మాధవధార, అంబేడ్కర్ కాలనీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏరియా, మహత్ కాలనీ పార్కు, వంశీనగర్, జీఐఎస్ ఏరియా, వుడా అపార్టుమెంట్స్, గంగా గోదావరి అపార్టుమెంట్స్, అప్పయ్యనగర్, రైవాడ పంప్‌హౌస్ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

రేపు జాబ్‌మేళా

గాజువాక: జిల్లా నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 8న జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ఆ సంస్థ అధికారి టి.చాముండేశ్వరరావు తెలిపారు. పెదగంట్యాడలోని ఎన్ఏసీ సెంటర్‌లో మేళా నిర్వహిస్తామన్నారు. బంధన్ బ్యాంక్, బిగ్ బాస్కెట్ ప్రైవేట్ లిమిటెడ్, భారత్ పే కంపెనీలు ఈ మేళాలో పాల్గొంటాయని పేర్కొన్నారు. ఇంటర్, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతీ యువకులు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చన్నారు.

క్యూఆర్ కోడ్‌తో నగదు చెల్లింపులు

తాటిచెట్లపాలెం: డిజిటల్ ఇండియాలో భాగంగా ఆన్‌లైన్ నగదు చెల్లింపులను క్యూఆర్ కోడ్ వినియోగిస్తూ చేయాలని రైల్వే అధికారులు సూచించారు. ఈ విషయమై వాల్తేర్ డివిజన్ పరిధిలో గల శ్రీకాకుళం రోడ్, విజయనగరం, రాయగడ, విశాఖపట్నం స్టేషన్లలో కమర్షియల్ సిబ్బంది ప్రయాణికులకు అవగాహన కల్పించారు. రిజర్వేషన్ టికెట్లు, అన్ రిజర్వుడు టికెటింగ్ సిస్టం వద్ద చెల్లింపుల కోసం క్యూ ఆర్ కోడ్ విధానాన్ని డివిజన్ పరిధిలో పరిచయం చేశారు. నగదు రహిత చెల్లింపుల్లో భాగంగా ప్రయాణికులు సాధ్యమైనంత వరకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. క్యూఆర్ కోడ్ రైల్వేస్టేషన్లలోని బుకింగ్ కౌంటర్ల వద్ద, రిజర్వేషన్ కౌంటర్ల వద్ద అందుబాటులో ఉంటుందని, ప్రయాణికులు వినియోగించుకోవాలని డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ సూచించారు.



విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

18 కేజీల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం మీదుగా అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న నిందితుడిని విశాఖపట్నం రైల్వే పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గవర్నమెంట్ రైల్వే పోలీసులు, రైల్వే భద్రతా దళం ఉన్నతాధికారుల ఆదేశాలతో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ రామారావు, ఆర్పీఎఫ్ ఎస్ఐ పీఆర్ బిషోయి సిబ్బందితో విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒడిశా రాష్ట్రం, గజపతి జిల్లాకు చెందిన బల్లా అన్నాజీ వద్ద 18 కేజీల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆ వ్యక్తి పాడేరు నుంచి ముంబయికి విశాఖపట్నం రైల్వేస్టేషన్ మీదుగా గంజాయి తరలిస్తున్నట్లు నిర్ధారించారు. నిందితుడిని జీఆర్పీ సిబ్బందికి అప్పగించగా రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు.

ఉత్సవ కమిటీ నియామకం

సీతంపేట : జీవీఎంసీ 26వ వార్డు రామకృష్ణానగర్‌లో దేవదాయ శాఖ పరిధిలో గల రామలింగేశ్వర ఆలయంలో కార్తీక మాసోత్సవాల నిర్వహణకు నూతన కమిటీ నియమించారు. ఈ మేరకు దేవదాయ శాఖ కమిషనర్ బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. కమిటీ సభ్యులుగా కె.శ్రీనివాసరావు, జి.గోవిందరెడ్డి, ఎ.రాములమ్మ, కె.పద్మ, కె.అనంతబాబు, బి.లక్ష్మణరావు, ఎస్.శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో జి.వి.రమాభాయి కమిటీ సభ్యులకు నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ నెల 30 వరకు ఉత్సవాలు విజయవంతంగా నిర్వహణకు కమిటీని నియమించడంపై స్థానిక నాయకులు ముక్కా కిషోర్, ఆలయ అర్చకులు, సిబ్బంది అభినందించారు.



కమిటీ సభ్యులతో ఈవో జీవీ రమాభాయి

జీవీఎంసీ దుకాణాలకు బహిరంగ వేలం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్-4, 5 పరిధిలో గల వాణిజ్య సముదాయాలు, కల్యాణ మండపాలు, మార్కెట్లకు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్టు ఆయా జోనల్ కమిషనర్లు ప్రకటనలో పేర్కొన్నారు. జీవీఎంసీ జోన్-4 పరిధిలో గల డైక్స్ ట్యాంక్ వాణిజ్య సముదాయం గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తు, జగదాంబ వాణిజ్య సముదాయం, పాతబస్టాండ్ ఫేస్-2, పద్మానగర్ వాణిజ్య సముదాయం, సూర్యాబాగ్ వాణిజ్య సముదాయం, అంబేడ్కర్ కల్యాణ మండపం, రామకృష్ణా రైతు బజార్, రెల్లివీధి (రోడ్డు సైడ్) ఫిష్ మార్కెట్లకు మూడేళ్ల కాల పరిమితికి అద్దెకిచ్చేందుకు ఈ నెల 14 ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం పాట జరుగుతుందని జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు తెలిపారు. జోన్-5 పరిధిలో గల 60వ వార్డు గుల్లలపాలెం షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాలు, త్రినాథపురం షాపింగ్ కాంప్లెక్స్ దుకాణం నంబరు 1, అలాగే 51వ వార్డు మాధవస్వామి కల్యాణ మండపం మూడేళ్ల కాలపరిమితికి, గుల్లలపాలెం దుకాణం రోడ్డు పక్కన మార్కెట్స్ హాకర్ మండలం, పల్లివీధి రోడ్ సైడ్ మార్కెట్, కంచరపాలెం రోడ్డు సైడ్ మార్కెట్, అక్కయ్యపాలెం రోడ్డు సైడ్ మార్కెట్లకు ఏడాదికి కాంట్రాక్ట్‌కు ఇచ్చేందుకు ఈ నెల 16 ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు జోనల్ కమిషనర్ బి. రాము తెలిపారు. వేలంపాటలో పాల్గొనదలిచే వారు ధరావతు సొమ్ము తదితర పూర్తి వివరాలకు ఆయా జోనల్ కార్యాలయ పని రోజుల్లో పర్యవేక్షకులను సంప్రదించవచ్చని తెలిపారు.

శిథిలావస్థలో ట్రెజరీ కార్యాలయం



శిథిలమైన షెడ్లలో విధులు నిర్వహిస్తున్న ట్రెజరీ సిబ్బంది




రేకుల షెడ్ల మీద పేరుకుపోయిన చెట్ల కొమ్మలు

భయాందోళనలో సిబ్బంది

సీతమ్మధార : స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గల జిల్లా ఖజానా కార్యాలయం శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కొన్ని దశాబ్దాల క్రితం నిర్మించిన రేకుల షెడ్డు కిందే సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. సుమారు 30 ఏళ్ల క్రితం ఇక్కడ కార్యాలయం ఏర్పాటు చేశారు. ముఖ్యమైన రికార్డులన్నీ ఇక్కడే భద్రపరుస్తారు.

జిల్లా ట్రెజరీ ఆఫీసర్ పర్యవేక్షణలో మొత్తం 12 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. భద్రత కోసం రిజర్వ్ పోలీసులు కూడా రెండు షిఫ్టుల విధానంలో ఇక్కడే పనిచేస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యమున్న కార్యాలయం శిథిలావస్థకు చేరుకున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వ శాఖల పింఛన్‌దారుల రికార్డులన్నీ ఇక్కడే ఉన్నాయి. వర్షాలు కురిసే సమయంలో రేకుల షెడ్లు కారిపోతున్నాయని, కంప్యూటర్లు తడిసి పోతున్నాయని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రేకుల షెడ్ల మీద అధిక సంఖ్యలో చెట్ల కొమ్మలు పేరుకుపోయినా తొలగించే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం అధిక సంఖ్యలో పింఛన్‌దారులు ఇక్కడికి వస్తుంటారని... దురదృష్టవశాత్తూ అనుకోని సంఘటన జరగకముందే కార్యాలయానికి మరమ్మతులు నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డు తవ్వకాలతో ఇబ్బందులు



రోడ్డు తవ్వడంతో మార్గంలో ఎత్తుగా మారిన ప్రదేశం

మురళీనగర్ : మురళీనగర్ వర్మా కాంప్లెక్స్ నుంచి బ్యాంకు వీధి రహదారిని కలిపే మలుపు వద్ద పైప్‌లైను కోసం తవ్వకాల వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ పైప్‌లైను కనెక్షన్‌లో భాగంగా తవ్విన మట్టి పొగులుగా వదిలేశారు. ఈ ప్రాంతంలో బ్యాంకులతోపాటు షాపులు, జిమ్‌లు ఎక్కువగా ఉన్నాయి. దీంతో ఈ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. మట్టి తవ్విన ప్రాంతంలో కనీసం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయలేదు. రాత్రిపూట ప్రయాణ సమయంలో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

డాబాగార్డెన్స్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20 వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకట్రావు తెలిపారు. రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ ఆదేశాల మేరకు అన్ని శాఖా గ్రంథాలయాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. వారోత్సవాల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి ముగింపు ఉత్సవంలో బహుమతులు ప్రదానం చేయనున్నట్టు చెప్పారు. అంతే కాక వారోత్సవాల్లో భాగంగా కవి సమ్మేళనం, గ్రంథ పాలకుల సదస్సు, మహిళా దినోత్సవం వంటి కార్యక్రమాలు ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడు కూడా నిర్వహిస్తున్నామని వెంకట్రావు తెలిపారు.